నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం,11 అక్టోబర్ 2024

అధిక బరువుతో కీళ్ళు అరుగుదల

కాకినాడ,మేజర్‌న్యూస్ : శరీరంలో కొవ్వు ఎక్కువగా ఉంటే బరువు పెరుగుతారని దీంతో కీళ్లు త్వరగా అరిగిపోయే అవకాశం ఉందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ చల్లా భావ తేజ పేర్కొన్నారు. రమణయ్యపేట రాయుడుపాలెం ఏపీ ఎస్పీ మూడో బెటాలియన్ పోలీసు విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో భావశ్రీ ఆర్థోపెడిక్ అండ్ ఈఎన్‌టి క్లినిక్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, శారీరక వ్యాయామం లోపించడంతో స్థూలకాయం ఏర్పడుతుందని అన్నారు. దీంతో నడవ లేని పరిస్థితి ఏర్పడటంతో పాటు అధిక రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బులు, పక్షవాతం, వందత్వం వంటి సమస్యలు ఏర్పడతాయని అన్నారు. దీనిని అధిగమించడానికి ప్రతిరోజు సమతుల ఆహారాన్ని తీసుకోవాలని, వ్యాయామం చేయాలని, మానసికంగా ఉత్సాహంగా ఉండాలని డాక్టర్ భావతేజ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంజు ఐకేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ డాక్టర్ చల్లా భావతేజను ఘనంగా సత్కరించారు. సంఘ అధ్యక్షులు డి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

అమ్మకంటే వేరే దైవం లేదు

- అమ్మ అనే పలుకే శ్రీరామరక్ష
- పరిపూర్ణానంద స్వామి
- శ్రీ పీఠంలో ఎనిమిదో రోజు ఘనంగా 'మహాశక్తి యాగం'
- 70 వేల మందికి పైనే భక్తులు హాజరు
- 90 కోట్లకు చేరిన శత కోటి కుంకుమార్చన

కాకినాడ, మేజర్‌న్యూస్ : 'అమ్మకంటే వేరే దైవం లేదు, అమ్మ అనే పలుకే శ్రీరామరక్ష' అని పరిపూర్ణానంద స్వామి అన్నారు.శ్రీ పీఠంలో ఎనిమిదో రోజు అత్యంత ఘనంగా 'మహాశక్తి యాగం' కార్యక్రమం జరిగింది. కాకినాడ జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల పలు జిల్లాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. అంతే కాకుండా యూట్యూబ్ ద్వారా లక్షల మంది తిలకించారు. పవిత్ర మహా శక్తి యాగంలో గురువారం అష్టమి రోజున ఉదయం 9 గంటల నుంచే మహాశక్తి యాగం ప్రారంభమైంది. 70 వేల మందికి పైనే ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో హాజరైన మహిళా భక్తులతో కాకినాడ అంతా ఎర్ర చీరలతో ఎరుపెక్కింది. ఇంత పెద్ద స్థాయిలో మహిళలచే 'శ్రీ లలితా సహస్ర విరాట్ పారాయణ' కార్యక్రమం జరగడం చరిత్రలో మొట్టమొదటిసారి అనిస్వామితెలిపారు.

ఈ సందర్భంగా నవగ్రహదోషపరిహారం కోసం లక్ష మంత్రార్చన కార్యక్రమం అంత్యంత ఘనంగా వైభవంగా జరిగింది.అలాగేదేవీ కవచం,బగళాముఖిదేవి హోమంలను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు.8వ రోజు శ్రీపీఠంలో వేంచేసియున్న ఐశ్వర్యంబికాఅమ్మవారిని శ్రీ బగళాముఖి దేవిగా అలంకరించారు.సంధర్భంగా భక్తులను ఉద్దేశించి పరిపూర్ణానంద స్వామి మాట్లాడుతూ శత కోటి కుంకుమార్చన కార్యక్రమం గురువారం నాటికి 90 కోట్లకు చేరిందని తెలిపారు. మహాశక్తి యాగం ఎటువంటి ఆటంకాలు లేకుండా అమ్మదయతోచాలాఘనంగా జరుగుతున్నాయ న్నారు. ఇటువంటి మహా కార్యంలో పాల్గొంటున్న మీరు ఎంతో అదృష్టవంతులు అన్నారు. 'అమ్మ పాదాలను పూజించండి, గురువు పదాలను అనుసరించండి. అమ్మ పాదాలను విడిచిపెట్టకండి గురువు పదాలను మరచిపోకండి' అని స్వామి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మనకు ఎలాంటి అవారాంతాలు లేకుండా మన సంకల్పం నేటితో 90 కోట్లకు చేరుకోబోతోందన్నారు. మీ లక్ష్యం అమ్మ కావాలి మీ లక్ష్యం అమ్మ నామం కావాలని సూచించారు. మీ నిష్ఠలో ఎక్కడా ఎటువంటి అవాంతరాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తి విజయవంతం కావడానికి అనేకమంది తీవ్రమైన కృషి చేస్తున్నారన్నారు. మీరందరూ అమ్మవారి అనుగ్రహం పొందేందుకు భారీ ఏర్పాట్లు చేశారని వివరించారు. ఈ 'మహాశక్తి యాగం'తో అద్భుతమైన చరిత్ర కాకినాడలో ఆవిష్కృతమైందని ఆనందం వ్యక్తం చేశారు. చిన్నపిల్లల నుంచి పెద్ద వయసుల వారు వరకూ అమ్మను ఆరాధించడానికి వచ్చారు.

ఇంత గొప్ప సన్నివేశాన్ని మనం ఆస్వాధిస్తూ మనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నటువంటి వారితో పాటు పోలీసు, మున్సిపాలిటీ, మీడియా అందరూ మంచి సహకారం అందిస్తున్నారన్నారు. ట్రస్ట్ ఆసుపత్రి నిర్వహకులు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఇలా ఒక్కొక్క వ్యవస్థ శ్రీపీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగానికి సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

అమ్మ అనుగ్రహంతో ఎప్పటికీ ఎవరికీ లోటు లేకుండా ఉండాలన్నారు. అమ్మ నామంతో, అమ్మ అనుగ్రహంతో అందరూ అమ్మకు చేరువుకావాలనే సంకల్పంతో అడుగులు ముందుకు వేయాలని సూచించారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు పూజా కార్యక్రమంలో స్వయంగా పాల్గొని లలిత సహస్ర నామ మంత్రోచ్ఛరణ చేశారు. అమ్మవారి చీరపై గంగా భవాని అనే భక్తురాలు లలితా సహస్రనామం రాసి పరిపూర్ణానంద స్వామికి అందించారు.

విశ్వకర్మ యోజన పథకంపై కమిషనర్ భావన సమీక్ష

- దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

కాకినాడ,మేజర్‌న్యూస్ : సంప్రదాయ చేతి వృత్తిదారులను ప్రోత్సహించేందుకుగాను ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనపథకం ప్రయోజనం కోసం కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో నమోదైన దరఖాస్తుల పరిస్థితిపై కమిషనర్ భావన సమీక్షించారు. ఈమేరకు గురువారం ఆ దరఖాస్తులకు సంబంధించి తీసుకున్న చర్యలను సంబంధిత యూపీఏవిభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ చేతి వృత్తిదారులనుంచి సుమారు 2748 దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి, వార్డు వెల్ఫేర్, కార్యదర్శుల ద్వారా విచారణ జరిపించాలని సూచించారు. తద్వారా వృత్తి నైపుణ్య కళాకారులు, సంప్రదాయ కుటుంబ వృత్తిని గుర్తించి వాటిని ఆమోదించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో టీపీఆర్వో శైలజ, మెస్మా సిటీ మిషన్ మేనేజర్ డి.వెంకట్రాజుపాల్గొన్నారు.

పోస్టల్ సేవాదృక్పదంతో పనిచేస్తోంది - సువర్ణరాజు

రాజమండ్రి,మేజర్‌న్యూస్ : లయన్స్ క్లబ్‌ఆఫ్ రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో ప్రపంచ పోస్టల్ దినోత్సవ సందర్భంగా జరిగిన సభలో ప్రధాన పోస్ట్ మాస్టర్ జి. సువర్ణ రాజు ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు పోస్టల్ డిపార్ట్మెంట్లో సేవలను విస్తరిస్తున్నామని, అన్ని రకాల ప్రజలకు పోస్టల్ సేవలు అందేలా చూస్తున్నామని చెప్పారు.పోస్టల్ డిపార్టుమెంట్ కమర్షియల్ దృక్పథంతో కాకుండా,సేవా దృక్పథంతో పనిచేస్తోందన్నారు. మారుమూల ప్రాంతాలకుసైతం సేవలందిస్తున్నది కేవలం పోస్టల్ శాఖ మాత్రమేనని అన్నారు.ఈసందర్భంగా పోస్టల్ సేవలు అందిస్తున్న పోస్ట్ మాన్లు సేనాపతి కామరాజు,శ్రీనివాసరావు, లక్ష్మణులను కూడా ఉచిత రీతిన సత్కరించారు.కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మద్దుల వి.ఎస్. శ్రీరామ గుప్తా అధ్యక్షత వహిస్తూ సామాన్య ప్రజలకు అందుబాటులో పోస్టల్ సేవలను విస్తరిస్తూ సమాజసేవ చేస్తున్న పోస్టల్ ఉద్యోగులను అభినందించడం ద్వారావారి సేవలను లయన్స్ గుర్తించిందన్నారు. ఈ కార్యక్రమంలో వెన్నా కుమారస్వామి,క్లబ్‌అడ్మిన్‌గ్రంధి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ వెన్నా కుమారస్వామి, క్లబ్ అడ్మిన్‌లైన్‌గ్రంధి వసంతకుమారి పాల్గొన్నారు.

రతన్ టాటా మృతితో భారతదేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయింది

- శాసనసభ్యులు వనమాడి కొండబాబు

కాకినాడ, మేజర్‌న్యూస్ : పారిశ్రామిక దిగ్గజం, మానవతా మూర్తి విలువలతో కూడిన వ్యాపారవేత్త రతన్ టాటా అని, రతన్ టాటా మృతితో భారతదేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయిందిని శాసనసభ్యులు వనమాడికొండబాబుపేర్కొన్నారు.కాకినాడ సిటీ తెలుగు దేశం పార్టీ కార్యాలయం నందు రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి కొండబాబు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన వ్యక్తి రతన్ టాటా ప్రపంచ దేశాలలో గుర్తింపు పొందారని, గొప్ప మానవతా మూర్తి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని, తన సంపదలో కొంత భాగాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించి తన దాతృత్వాన్ని చాటుకున్నారని, ముఖ్యంగా కరోనా సమయములో భారీ విరాళం అందించారని, స్థిరమైన వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసి విలువలతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని ఏర్పరిచారని, వ్యాపార రంగంలో చెరగని ముద్ర వేశారని, దూర దృష్టితో ఆలోచించి వ్యాపార రంగంలో అడుగులు వేసి సక్సెస్ సాధించారని, ప్రపంచ వ్యాప్తంగా 100 కుపైగా దేశాలలో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపచేసిన రతన్ టాటా ఎందరికో ప్రత్యక్షంగా, పరోక్షంగా మరేందరికో ఉపాధికి కారకులయ్యారని, కష్టపడే తత్వం సేవా దృక్పధం ఆయన స్థాయిని పెంచాయిని, టాటా కంపెనీ అంటే ప్రజలలో ఒక నమ్మకాన్ని కలిగించారని, రతన్ టాటా మృతి యావత్ భారతదేశాన్ని కదిలించిందని, భారతదేశం గొప్ప వ్యాపారవేత్తని మానవతా మూర్తిని కోల్పోయిందిని తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్, ఒమ్మి బాలాజీ, గుమ్మల చిన్న, పిన్నమరెడ్డి బుజ్జి పాల్గొన్నారు.

ఇసుక సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

కాకినాడ, మేజర్‌న్యూస్ : కాకినాడ జిల్లాలో ఇసుక సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందని కాకినాడ జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ కింద 8 జూలై 2024 నుండి ఇసుక సరఫరా చేయబడుతోందని, కాకినాడ జిల్లాలో, ఇప్పటివరకు ఎటువంటి రీచ్‌లు/డీ-సిల్టేషన్ పాయింట్లు/ఇసుక డిపోలు ఉనికిలో లేవని, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాల నుండి ప్రజల అవసరాల కోసం ఇసుకను సేకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాకు నిర్దిష్ట రీచ్ కేటాయింపు కోసం తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్లు మరియు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లతో చర్చించి ఎప్పటికప్పుడు వినియోగదారులకు ఇసుకను సులభంగా సరఫరా చేసేందుకు కాకినాడ జిల్లా యంత్రాంగం తగిన చర్యలు తీసుకుంటోందన్నారు. తేదీ 14.09.2024 నాటి జీవో-52 ప్రకారం రవాణా ధరలు రాష్ట్రం అంతటా ఒకే విధంగా మరియు సహేతుకమైనవిగా చేయబడ్డాయి. ధరల హెచ్చుతగ్గులు లేదా రవాణాదారుల దోపిడీ లేకుండా ఉండేలా రేట్లు నియంత్రించబడ్డాయన్నారు. వినియోగదారులు ఇసుకను రవాణా చేయడానికి వారి స్వంత వాహనాలను ఎంచుకోవచ్చు లేదా నిర్ణీత రేటుతో ప్రభుత్వం అందించిన రవాణాను ఎంచుకోవచ్చన్నారు. ఇసుక సరఫరాను పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. తూర్పుగోదావరి ప్రక్కనే ఉన్న జిల్లాలతో పాటు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ నుండి వినియోగదారులకు ఇసుక సరఫరా చేయడానికి, కాకినాడ జిల్లాలో 257 మంది రవాణాదారులు తమ వాహనాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక విక్రయాలు లేదా హోర్డింగ్‌లకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాకినాడ జిల్లాలో ఇసుక రీచ్‌లు లేవు మరియు డీ-సిల్టేషన్ పాయింట్లు ఉనికిలో లేవు కాబట్టి రసీదులో లెక్కింపు ఛార్జీలు తలెత్తవు. జిల్లా స్థాయి సులభతర కేంద్రం ఆఫీస్ ఆఫ్ డిస్ట్రిక్ట్ మైన్స్ అండ్ జియాలజీ ఆఫీసర్, కాకినాడలో టోల్ ఫ్రీ నెం. 1800-425- 6019 మరియు ఇ-మెయిల్‌తో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు.

జిల్లా స్థాయి సులభతర కేంద్రాలు బుకింగ్ మరియు డెలివరీ ప్రక్రియల అంతటా వినియోగదారుని సులభతరం చేస్తాయి మరియు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వినియోగదారులు మరియు రవాణాదారుల మధ్య అంతరాన్ని తగ్గించడం, కమ్యూనికేషన్‌ను క్రమబద్ధీకరించడం, సకాలంలో డెలివరీలను నిర్ధారించడం మరియు ఫిర్యాదులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఇంకా, ఏదైనా సాంకేతిక సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర స్థాయిలో కమాండ్ & కంట్రోల్ సెంటర్లు ఉన్నాయన్నారు. ఏపీ ఇసుక నిర్వహణ వ్యవస్థ యొక్క ఆన్‌లైన్ పోర్టల్ ప్రకారం, వినియోగదారులు 497 బుకింగ్‌లు చేసారు. వాటిలో, 272 బుకింగ్‌లు పంపిణీ చేయబడ్డాయి, మిగిలిన 225 బుకింగ్‌లు ప్రాసెస్‌లో ఉన్నాయని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా ఒక ప్రకటనలో తెలిపారు.

సూపర్ బజార్ ధరలు అందుబాటులో ఉంచాలి

కాకినాడ,మేజర్‌న్యూస్ : కాకినాడ సూపర్ మార్కెట్ రిటైల్ దుకాణంలో నిత్యవసర వస్తువుల ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని ఆ బజార్ను అభివృద్ధి పథంలో పనిచేసేలా చొరవ తీసుకోవాలని సూపర్ బజార్ చైర్మన్ ప్రెసింగి ఆదినారాయణను 93 బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మాకిరెడ్డి భాస్కర్ గణేష్ కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆదినారాయణను సూపర్ బజార్లోని ఆయన చాంబర్లో మాకిరెడ్డి ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలే చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా భాస్కర్ గణేష్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన సూపర్ బజార్ చైర్మన్‌గా ఆదినారాయణ చేపట్టడం తమకు చాలా సంతోషకరమన్నారు. బీసీ నాయకుడిగా ఉంటూ ఎన్నో ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొన్న ఆదినారాయణ అదే తరహాలో సేవలను సూపర్ బజార్‌కి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాలకు చెందిన నాయకులు ఎవిడి మెంటారావు,ఆవుపాటి ఉమాశంకర్,చిలుకు గంగబాబుపాల్గొన్నారు.

నేటితో 'మద్యం' దుకాణాల దరఖాస్తుకు ముగింపు

రంపచోడవరం, మేజర్‌న్యూస్ : మద్యం విధానం 2024-26కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 11వ తేదీతో ముగుస్తుందని రంపచోడవరం ఎక్సైజ్ సీఐ ఎన్.శ్రీధర్ గురువారం తెలిపారు. అక్టోబర్ 11 తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ కాబడి టోకెన్ తీసుకున్న చివరి వ్యక్తి వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తు చేసుకుని ఎంట్రీ పాస్ పొందిన ప్రతీ దరఖాస్తుదారుడు ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు పాడేరులోని విశాఖపట్నం రోడ్డులో ఎస్పీ ఆఫీసు దగ్గర ఉన్న విఆర్ ఫంక్షన్ హాల్ కు హాజరు కావాలన్నారు. ఇప్పటివరకు జరిగిన దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలో రంపచోడవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 10 షాపులకు 168 అప్లికేషన్స్ అందాయన్నారు. అలాగే చింతూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 8 షాపులకు 320 అప్లికేషన్లు స్వీకరించడం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పర్యాటకం అభివృద్ధి దిశగా కొనసాగుతున్నందున దరఖాస్తుదారులు అప్లికేషన్ వేయడానికి ఆసక్తిగా ఉన్నారని టాస్క్ ఫోర్స్ ఏఈఎస్ పి.నాగ రాహుల్, రంపచోడవరం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీధర్ తెలియజేశారు. కాగా చివరిరోజు చలానాలు మాత్రమే అనుమతిస్తామని బ్యాంకు డిడిలు తీసుకోవడం లేదని తెలియజేశారు. లాటరీలో దుకాణాలు పొందినవారు అదే రోజు 1/6 వంతు రిటైల్ ఎక్సైజ్ టాక్స్ చలానా రూపంలో అక్కడే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. లాటరీ జరుగు ప్రదేశానికి నిర్ణీత సమయానికి చేరుకోవలసిన బాధ్యత దరఖాస్తుదారులదేనని ఎక్సైజ్ సీఐ శ్రీధర్ పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం,మేజర్‌న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టాసింహాచలం వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం రంపచోడవరం మండలం పెద గెద్దాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సింహాచలం ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది.ముందుగా ప్రతీరోజు ఎంతమంది రోగులకువైద్య సేవలు అందించుచున్నది, ఎంతమంది వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నది, అదేవిధంగా ప్రతిరోజు మలేరియా కేసులు ఎన్ని వస్తున్నాయి, ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు స్వీకరించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు సరఫరా చేయాలన్నారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచాలని ఆయన ఆదేశించారు.ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని ప్రాజెక్ట్ అధికారి సూచించారు.

విజయభేతాళస్వామి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటి సహకరించాలి- కొత్తపేట డి.ఎస్.పి గోవిందరావు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈనెల 16న అంబాజీపేట లో నిర్వహించే విజయ భేతాళ వాహన ఉత్సవంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, రికార్డింగ్ డాన్సులకు ఎట్టి పరిస్థితుల్లో తావు లేదని, విజయ భేతాళ స్వామి తీర్థం వైభవంగా నిర్వహించేందుకు వాహన నిర్వాహకులు సహకరించాలని కొత్తపేట డి.ఎస్.పి. వై.గోవిందరావు ఉత్సవ కమిటీకి సూచించారు. గురువారం స్థానిక పెద్ద వీధిలో ఉన్న ఏవీఆర్ గ్రాండ్ మినీ ఏసీ కల్యాణ మండపంలో పి.గన్నవరం సిఐ ఆర్ భీమరాజు అధ్యక్షతన ఉత్సవ కమిటీ తో సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న డి.ఎస్.పి. గోవిందరావు మాట్లాడుతూ వాహన నిర్వాహకులు తమ తమ వాహనాలను సక్రమంగా తీసుకుని రావాలని, వాహనాల వివరాలు ఇవ్వాలన్నారు.వాహనాలను నడిపే డ్రైవర్లకు తప్పకుండా లైసెన్సులు ఉండాలన్నారు.ప్రతివాహనం నుండి నలుగురు కమిటీ సభ్యుల పేర్లను ఇవ్వాలని, వాహనాల వద్ద ఉండే వాలంటీర్లకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ఉండాలని సూచించారు. ముఖ్యంగా సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, రికార్డింగ్ డాన్సులకు ఎట్టి పరిస్థితుల్లో తావు లేదని డి.ఎస్.పి. హెచ్చరించారు. కొంతమంది యువకులు మద్యం సేవించి, మోటారు సైకిళ్ళ పొగగొట్టాలు (సైలెన్సర్లు) తీసివేసి వాహనాలు వేగంగా,నిర్లక్ష్యంగా నడుపుతున్నారని, దీనివల్ల తీర్థానికి వచ్చే మహిళలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. అటువంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్న యువకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శ్రీ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ అధ్యక్షులు దొమ్మేటి రామారావు మాట్లాడుతూ ఉత్సవాన్ని సాంప్రదాయంగా నిర్వహిస్తామని, ఇప్పటికే తమ పాలేలలో ఉన్న ఆయా వాహనాల కమిటీలతో చర్చించామన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శీలం సత్య అర్జున మోహన్‌రావు మాట్లాడుతూ గత 58 ఏళ్లుగా భేతాళ ఉత్సవాన్ని ఎంతో సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా పూర్తి సాంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్సై కె.చిరంజీవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు పెయింటింగ్ వర్కర్స్ ఆర్థిక సహకారం

- ఎమ్మెల్యే రాజప్ప చేతుల మీదుగా అందజేత

పెద్దాపురం,మేజర్‌న్యూస్ : ఇటీవల ఏలేరు వరదల కారణంగా ముంపుకు గురయ్యి ఇళ్ళు కోల్పోయిన పెద్దాపురం మండలం, మర్లావ గ్రామంలో 12 కుటుంబాలకు, ఒకొక్క కుటుంబానికి రూ.5వేలు చొప్పున పాండవగిరి పెయింట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగాగురువారంమర్లావ గ్రామంలో అంద జేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ వరద బాధితుల కోసంమానవసేవే మాధవ సేవ అని తలచి, పెయింటింగ్ వర్కర్లు ఈ సహకారం అందించడం ఎంతో సంతోషమని, ఎవరికి ఆపద వచ్చినా స్పందించే గుణం అందరికి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోట రామకృష్ణ,ఎలిశెట్టి నాని, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాసూరిబాబురాజు,పాండవగిరి పెయింట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు నీలం శ్రీను, కోశాధికారి వల్లపు సూరిబాబు,కరణం అప్పారావు, శెట్టి రాజు, కంపర వీరబాబు, గడపా రమణ, గొల్ల భద్రరావు,కునుపూడిశివకుమార్, డి.క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వంచంగిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిభిరం

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని జడ్డంగిపిహెచ్‌సి పరిధిలోని వంచంగిలో వైద్యాధికారి నాగార్జున ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిభిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలలో వివిధ రుగ్మతలతో బాధపడుతున్న 36 మందికి డాక్టర్ నాగార్జున వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ప్రజలుతీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు నూకరత్నం, రాజులమ్మ హెల్త్ అసిస్టెంట్ రాజు బాబు,104 డిఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశ వర్కర్లు సేవలు అందించారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ

అంబాజీపేట, మేజర్ న్యూస్ : రాష్ట్ర స్థాయి అండర్ 14,17,19 తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండోక్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి సిల్వర్ మెడల్ను గెలుచుకున్నట్లు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా తైక్వాండో కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు.అంబాజీపేటజెడ్పీ హైస్కూల్లో క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి గురువారం అభినందించారు.ఈ నెల4,5 తేదీల్లో రైల్వే కోడూరులో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్‌లో ఎ.బి.చైతన్య సిల్వర్ మెడల్ సాధించాడు. 6,7,8 తేదీలలో తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్లో నిర్వహించినఅండర్-14,17విభాగాల్లో ఎం.మౌనిక సిల్వర్ మెడల్‌ను,బీహెచ్.రితిక్ బ్రౌన్ మెడల్ సాధించా రన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎస్సై చిరంజీవితో పాటు ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

ఎటపాక, మేజర్‌న్యూస్ : నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు ఎనిమిదో రోజు అయిన గురువారం దుర్గదేవి అలంకరణలో భక్తులు దర్శనమిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల కాలనీ గ్రామంలో కనకదుర్గ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవంలో భాగంగా అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని గ్రామస్తులు, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎనిమిదోరోజు దుర్గతులను నాశనం చేసే శ్రీ దుర్గాదేవి అలంకరాం కుమారుడైన దుర్గమూడు అనే రాక్షసున్ని సంహరించింది అష్టమి రోజునే, కనుక ఈ రోజును దుర్గాష్టమి అని, దుర్గముని సంహరించిన అవతారం కనుక దేవిని 'దుర్గా' అని పిలుస్తారు. శ్రీ దుర్గాదేవి ఉగ్ర స్వరూపిణి కనుక ఈ దేవిని దుర్గా అష్టోత్తారాలు, దుర్గా సహస్రనామాలకు బదులు శ్రీ లలితా అష్టోత్తరాలు, శ్రీ లలిత సహస్రనామాలుతో పూజిస్తారు. ఎందుకంటే లలితా పరమ శాంత రూపం దుర్గ రూపం అని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

రతనాటా సేవలు ప్రపంచ దేశాలకు స్ఫూర్తి

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన మానవతామూర్తి రతన్‌టాటా సేవలుప్రపంచదేశాలకు స్ఫూర్తిదాయకమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన రతన్ టాటా చిత్రపటం వద్ద గురువారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, ఎంపీడీఓలు మాట్లాడుతూ రతన్లాటా కష్టపడే తత్వం సేవా దృక్పదమే ఆయన స్థాయిని పెంచాయని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి

కాకినాడ,మేజర్‌న్యూస్ : ఖరీఫ్ 2024-25 సీజన్ లో రైతు సేవా కేంద్రాలు (ఆర్ఎస్‌కే) ద్వారా నిర్వహించే ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల సంస్థ అధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ లోని విధాన గౌతమి సమావేశ మందిరంలో ఆర్ఎస్‌కే ద్వారా రైతులు నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై మండల స్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా.. రెవిన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ 2024-25 సీజన్ లో పౌరసరపరాల సంస్థ ద్వారా ధాన్యం కొనుగోలుకు అనుసరించాల్సిన మార్గదర్శకాలు, క్షేత్రస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో అనుసరించాల్సిన విధానం, నాణ్యత ప్రమాణాలు అమలు చేయడం, కనీస మద్దతు ధర, గోనె సంచులు, మండల స్థాయి ధాన్యం కొనుగోలు కమిటి ఏర్పాటు, కస్టోడియన్ అధికారులు నియామకం, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా రైసుమిల్లులకు తరలింపు వంటి అంశాలపై జేసీ రాహుల్ మీనా.. మండల స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం ఈ ఖరీఫ్ సీజన్ లో రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో 277 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం

కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగిందని ఆయన తెలిపారు. క్షేత్రస్థాయిలో జరిగే ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. ఇందుకు మండల స్థాయిలో తహసీల్దార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కమిటి అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని జేసీ అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి ఆర్ఎస్కే లోను అవసరమైన సిబ్బంది, తేమ శాతం యంత్రాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. దళారులు, మధ్యవర్తులు ప్రమేయం లేకుండా, రైస్ మిల్లర్ల చేతిలో రైతులు నష్టపోకుండా రైతు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు అమ్ముకునేలా ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని జేసీ తెలిపారు. మరియు ప్రస్తుత ఖరిఫ్ 2024-25 సీజనులో రైతులకు రైస్ మిల్లు ఎంచుకొనే వెసులుబాటును కల్పించారని తెలియజేసారు. ఈ-పంట నమోదు చేసుకుని, ఈ-కైవైసీ పూర్తి చేసుకున్న రైతులందరి నుంచి ధాన్యం సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ధాన్యం విక్రయించిన రైతు తన ఆధార్ నెంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంక్ ఖాతాకు నేరుగా ధాన్యం డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతే స్వయంగా గోనె సంచులు, రవాణా, హమాలి చార్జీలు పెట్టుకుంటే ఆ సొమ్మును కూడా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సొమ్ముతో సహా రైతు ఖాతాలోకి జమ చేయడం జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8886903611 ను సంప్రదించవచ్చునని జేసీ రాహుల్ తెలిపారు.

అనంతరం తేమ శాతం యంత్రాల పనితిరు, రైతుకు ధాన్యం కొనుగోలు కూపన్ ఇవ్వడం, ధాన్యం నాణ్యతను నిర్ధారణ చేయడంలోని వివిధ దశలను ఈ సందర్భంగా జేసీ..పౌరసఫరాలు అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శిక్షణ కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎం.వి. ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, సహకారశాఖ అధికారులు, పౌరసరఫరాల సంస్థ అసిస్టెంట్ టెక్నాల్ మేనేజర్ వి.విజయ్ రాజు, అన్ని మండలాల తహశీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు, పౌరసరఫరాల శాఖ సిబ్బంది, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు పందిరి రాట

ఆత్రేయపురం,మేజర్‌న్యూస్: కోనసీమతిరుమలవాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 21నుండి 29 వరకు జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలు నేపథ్యంలో గురువారం ఉదయం పందిరిలాట ముహూర్త కార్యక్రమాన్ని అర్చకులు రమణీయంగా జరిపించారు. ఈ సందర్భంగా నవధాన్యాల పూజ, నీరాజనం మంత్రపుష్పం, గోపూజ తదితర కార్యక్రమాలను అర్చకులు శాస్త్రవేత్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు, సీనియర్ నాయకులు ముదునూరి రాంబద్రరాజు, లోల్ల సర్పంచ్ కాయల జగన్నాథం, సూపర్నెంట్ శ్రీనివాస్,సిబ్బంది,అర్చకబృందం పాల్గొన్నారు.

డీఎస్సి పోటీ పరీక్షలు కోసం వసతితో కూడిన శిక్షణ

-నోడల్ ఏజెన్సీస్ నుంచి దరఖాస్తులు ఆహ్వానం
-కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ : రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సి ఎస్టీ లకి చెందిన డిస్సికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వసతి తో కూడిన శిక్షణ అందజేసేందుకు ఆసక్తి కలిగిన ఏజెన్సీస్ నుంచీ దరఖాస్తులను ఆహ్వానిస్తూన్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 5050 ఎస్సి, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డీఎస్సీ, శిక్షణ ఇచ్చుటకు నిర్ణయంచడం జరిగిన నేపథ్యంలో ఈ మేరకు ఆసక్తి కలిగిన నోడల్ ఏజెన్సీస్ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది అని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎస్సీ ఎస్టీ శిక్షణ సంస్థల యందు సాంఘిక / గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్ లలో నందు నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డిఎస్సీ రిక్రూట్మెంట్లకు కోచింగ్ ఇచ్చిన అనుభవం, గతంలో నిర్వహించిన డీఎస్సీ రిక్రూట్మెంట్ లో శిక్షణ ఇచ్చిన అభ్యర్థులలోకనీసం 100 మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలని, ఇతర నియమ నిబంధనలు కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియ చేశారు. శిక్షణ సంస్థలు నిర్ణీత ఫారం ను 7-10-2024 నుండి డౌన్లోడ్ చేసుకునేందుకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ధరఖాస్తు చేసుకోవడానికి అక్టోబరు 21వ తేదీ చివరి తేదీ అని ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో శ్రీ వాసవి మాత

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా అంబాజీపేట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు భక్తులకు శ్రీ రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ కావించారు. ఈకార్యక్రమంలో అధ్యక్షులు కాసు శ్రీనివాసురావు, కార్యదర్శి గోకవరం శివ, ఉపాధ్యక్షులు నిట్టాల శ్రీకృష్ణ బాలాజీ, వెదుళ్లపల్లి బాబు, సంయుక్త కార్యదర్శి గెల్లి సంతోష్, గాదె సతీష్, కోశాధికారి బొండాడ శివ, సభ్యులు గ్రంధి సాయిబాబు నార్కెడమిల్లి బద్రి,గ్రంధి శీను అప్ప మణికంఠ, పాబోలు శివ, కడించర్ల అర్జునుడు, కాసు సాయి బుజ్జి పాల్గొన్నారు.

కాకినాడ డిపోలో డయల్ యువర్ డిఎమ్

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ డిపోలో డయల్ యువర్ డియం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమం లో డిపో మేనేజర్ ఎంవి మనోహర్ ప్రయాణికుల సమస్యలు తెలుసుకు న్నారు. కాకినాడకు చెందిన ప్రసాద్ మరియు రామకృష్ణ పండురు జంక్షన్ వద్ద ఉన్న కేంద్రీయ విద్యా లయం దగ్గర బస్సులు ఆపుట లేదని ఫిర్యాదు చేసి యున్నారు. కాకినాడకు చెందిన మోహన్ కాకినాడ నుండి రాజమండ్రి ఎయిర్ పోర్ట్ కు బస్సులునడపవలసిందిగా కోరినారు. కాకినాడకుచెందిన సుబ్బారావు జమున నగర్ కాలనీ వద్ద బస్సులు ఆపుటలేదని ఫిర్యాదు చేసినారు. ఫిర్యాదులపై సాధ్యాసాధ్యాలనుపరిశీలించితగుచర్య తీసుకుంటామని డిపో మేనేజర్ ఎం.వి. మనోహర్ తెలిపారు. ఇంకా పలువురు ప్రయాణికులు సమస్యలు డిఎమ్ దృష్టికి తీసుకువచ్చారు.

శివ శివా.. మన్నించు...

-పవిత్ర పాదగయ ఆలయంలో పర్యవేక్షణ కరువు
-శివలింగాన్ని నాకుతూ కనిపించిన శునకం
-పవిత్ర శివలింగం ప్రక్కన మూత్ర విసర్జన
-ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై భక్తుల మండిపాటు

పిఠాపురం, మేజర్ న్యూస్ : దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పవిత్ర పాదగయ ఆలయం నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో గల కోనేరులో మురుగు పూర్తిగా తొలగించకుండా .. నీటిని వదిలి పెట్టిన ఘటన మరువకముందే మరో ఘటన చోటుచేసుకుంది. ఆ ఘటన చూసిన భక్తులు శివ శివా..మన్నించు... అంటూ ఆ స్వామిని వేడుకోవడం కనిపించింది. ఆలయ ప్రాంగణంలో... భక్తులు పరమ పవిత్రంగా భావించి నిత్య పూజల నిర్వహించే పవిత్ర శివలింగం మరియు నందీశ్వరుని విగ్రహాలను అక్కడి శునకాలు నాకుతూ అపవిత్రం చేసి మూత్ర విసర్జన చేస్తూ కనిపించాయి. దృశ్యాన్ని చూసిన పలువురు భక్తులు శివశివ మన్నించుఅంటూస్వామిని వేడుకోవడం కనిపించింది. పవిత్ర ఆలయంలో పర్యవేక్షణ కరువైందని, ఆలయంలో పనిచేస్తున్న అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు. సంవత్సరాల తరబడి ఆలయంలో పాతుకుపోయిన పలువురు సిబ్బంది ఆలయ ప్రాముఖ్యతను పక్కనపెట్టి నిర్లక్ష్యంగా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ ప్రాంగణంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న శునకాలను కనీసం పట్టించుకోకుండా ఆలయ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆ శునకాలు భక్తులపై దాడి చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని భక్తులు ప్రశ్నిస్తున్నారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతూ... ఎంతో ప్రాముఖ్యత కలిగిన పవిత్ర పాదగయా క్షేత్రంపై స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆలయ అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకుని, ఆలయ పవిత్రతను కాపాడాలని భక్తులు కోరుతున్నారు.

పౌరసరఫరాల శాఖ తీరుపై ఎమ్మెల్యే వనమాడి అసహనం

- అధికారులు ద్వారంపూడికి తొత్తులుగా పనిచేస్తున్నారని విమర్శ

కాకినాడ,మేజర్‌న్యూస్ : పౌరసరఫరాలశాఖ చెందిన అధికారులు నిర్వహిస్తున్న తీరుపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు)అసహనం వ్యక్తం చేశారు. కాకినాడ పోర్ట్ ఏరియాలో ఐదు సాట్రెక్స్ మిల్లులకు 15 రోజుల క్రితం అక్కడ కార్యకలాపాలు ఆపాలంటూ నోటీసులను పౌర సరఫరాల అధికారులు ఇచ్చినట్లు చెప్పారు. ఐదు మిల్లులు కార్యకలాపాలు ఆపివేయగా ఈ ఐదు మిల్లులుపై సుమారు 5 వేల మంది వరకు కుటుంబ సభ్యులు జీవిస్తున్నారన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా ఇదే ఏరియాలో శ్రీ చిత్ర ఆగ్రో ఎక్స్‌పోర్ట్ మిల్లు తీసుకున్న నోటీసులను పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా మిల్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ మిల్లు కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి సామాజికవర్గానికి చెందినవారిదని చెప్పారు. గురువారం ఎమ్మెల్యే వనమాడి ఆ మిల్లులో జరుగుతున్న కార్యక్రమాలను పరిశీలించేందుకు వెళ్లారు. ఈసందర్భంగా అక్కడ ఆపై విషయాలను వివరించారు. కాకినాడలో పౌరసరఫరాల అధికారుల తీరు సరిగా లేదని ఇంకా వారు వైకాపా నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని, వీరిపై ఫిర్యాదు చేయనున్నట్లు వనమాడి చెప్పారు.

సర్వపాప హారం వెంకన్న నామం - యాతగిరి

కాకినాడ,మేజర్‌న్యూస్ : స్థానిక గోదారిగుంట జర్నలిస్ట్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో శరన్నవరాత్రి సందర్భంగా శ్రీనివాస కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. మాధ్వ పురోహితులు యాతగిరి మద్వేష్ ఆధ్వర్యంలో ఈ విశేష కార్యక్రమం జరిగియి. గత మూడు దశాబ్దాలుగా శరన్నవరాత్రి సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి మాహాత్యాన్ని ప్రవచన మరియు పారాయణం రూపంలో ఈ తొమ్మిది రోజులు పాటు యాతగిరి మధ్వ పంచాంగం కర్త డాక్టర్॥యాదగిరి పరుశురామ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ వున్నామని,ఈసంవత్సరం కూడా ఆ వేడుకలు మరియు ప్రవచన కార్యక్రమం నిర్విఘ్ననంగా జరుగుతోందని అందుకు మా గురుదేవులైన శ్రీ శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ పరిపూర్ణ అనుగ్రహమే ఇందుకు కారణమని మద్వేష్ చెప్పారు. శ్రీనివాస కళ్యాణ మహోత్సవం సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించడమే కాక కళ్యాణ మహోత్సవ సమయంలో శ్రీవాదిరాజ స్వామీజీ విరచిత లక్ష్మీ శోభన కీర్తనను పలువురు మహిళలు సామూహికంగా ఆలపించారు. శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి నూతన వస్త్రాలను నందగిరి నందా వివాహ సమయంలో సమర్పించగా అందరికీ వేద ఆశీస్సులను డాక్టర్ పరుశురామ్ అందజేశారు. శ్రీనివాస కళ్యాణం నిర్వహించడం అంటే జగత్తులో ఉన్న అందరూ సుఖ సంతోషాలతో జీవనం కొనసాగించడానికి అని, భగవంతుడు ఎల్లవేళలా మానవులు చేత కర్మలను నిర్వహింపచేస్తూ పుణ్యప్రదమైన కరుణా కటాక్షాలను అందిస్తూ ఉంటారని డా॥పరుశురామ్ చెప్పారు. శ్రీవేంకటేశ్వర స్వామి నామాన్ని పలికినంత మత్రామే సర్వపాపాలు హరించబడుతాయని ఈ విషయాలు స్వామి పర్వతాల మహిమ ఉదంతంలో మనకు తెలుస్తుందన్నారు. ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్య ప్రమోద తీర్థ అనుగ్రహముతో ఏర్పాటు అయినా శ్రీ రమా సహిత సత్యదేవ మందిర ప్రాంగణంలో మధ్వ సంప్రదాయ కార్యక్రమాలతో పాటు మధ్వ గురువుల యొక్క విశేష కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని అందుకు మాధ్వ గృహస్తులు అందరూ సహాయ సహకారాలను అందించడం వల్లే ఇంతటి సౌభాగ్యమానమైన కార్యక్రమాలను దిగ్విజయంగా జరిపిస్తున్నామన్నారు. ఈ శరన్నవరాత్రి 9 రోజులు పాటు ఘృత మరియు తైల అఖండ దీపాన్ని వెలిగించడం ద్వారా అందరికీ భగవంతుని అనుగ్రహంతో పాటు లక్ష్మీదేవి కటాక్షం కూడా పరిపూర్ణంగా లభిస్తుందని పరశురామ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జాగీర్దార్ ప్రేమ కుమార్, ఉదయగిరి శేషగిరిరావు, తాడూరి శ్రీనివాస్, సూత్రాల వసంత లక్ష్మి,మనోజ్ఞ,తుంగమణి,రేగడమిల్లికళ్యాణి, పుట్టా లక్ష్మితోపాటు శ్రీబాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం వ్యవస్థాపకులు పసుమర్తి సత్యనారాయణమూర్తి, కొంపెల్లవెంకటసుబ్బారావు అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం

కాకినాడ,మేజర్‌న్యూస్: కాకినాడజిల్లాలోనిఅన్ని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు,గ్రామాలలో మంచినీటి వసతి పారిశుద్ధ్య కార్యక్రమాలపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టడం జరిగిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. కాకినాడ జిల్లాలోని 7 నియోజకవర్గాలవారీగా ఆయా నియోజకవర్గాల్లోని మండలాలు గ్రామాలలోని పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాల కాంప్లెక్స్‌లు, గ్రామాలలో మంచినీటి వసతి, పారిశుద్ధ్య కార్యక్రమాలలో ఉన్నలోపాలను, ఇబ్బందులను గుర్తించి వాటిని సరి చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

మొదటిగా పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం, యూ.కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాలలోని అన్ని గ్రామం పంచాయతీలలో, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో ఉన్న పాఠశాలలు ఆసుపత్రిలు, వసతి గృహాలు, గ్రామాలలో డ్రింకింగ్ వాటర్ మరియు పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి నివేదిక సమర్పించేందుకు ప్రతి గ్రామానికి నోడల్ అధికారులను నియమించడం జరిగిందని, ప్రత్యేక అధికారులను నియమించిన గ్రామాలలో పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, గ్రామాలలో మంచినీటి సదుపాయం శానిటేషన్ మొదలగు విషయాలన్నిటిని పరిశీలించి వాటిపై నివేదికను ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. గ్రామాలలో ప్రత్యేక అధికారులు గుర్తించిన సమస్యలు పరిష్కరించడం జరుగుతాదని ఆయన తెలిపారు. గుర్తించిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందని, జిల్లాలోని మొత్తం అన్ని నియోజక వర్గాలలోని అన్ని మండలాలు అన్ని గ్రామ పంచాయతీలలో పాఠశాలలు, వసతి గృహాలు, ఆసుపత్రులు, గ్రామాలలోని మంచినీటి వసతి పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి అందులో ఉన్న లోటుపాట్లను గుర్తించి వాటిని సరిచేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. వీటి కోసం ప్రభుత్వం ప్రత్యేకించి నిధులు కేటాయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి లోని గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులు అందరూ ఈరోజు గ్రామాలలో పర్యటించి పాఠశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు, గ్రామాలలో మంచినీటి సదుపాయం పారిశుద్ధ్య కార్యక్రమాలు పరిశీలించడం జరుగుతుందని వారు అందించిన సవివరమైన నివేదికను ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు.

నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు

అంబాజీపేట,మేజర్‌న్యూస్ : నిత్యావసర వస్తువులు అధిక ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని,మండలంలోని అన్ని కూరగాయలు, కిరాణా,సూపర్‌మార్కెట్ల వద్ద వినియోగదారులకు అర్థమయ్యే రీతిలో దరల పట్టిక వివరాలను ఉంచాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఎమ్ఎస్‌వో ఎస్.సత్యనారాయణ, డీటీ సి.హెచ్.వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేటలో ఉన్న కిరాణా,కాయకూరలు,సూపర్ మార్కెట్లను ఎమ్ఎస్‌వో,డీటీలు గురువారం తనిఖీ చేశారు. ఈ సందదర్భంగా వారు మాట్లాడుతూఉన్నతాధికారులఆదేశాలమేరకు షాపు నిర్వాహ కులకు ధరలపై సూచనలు చేస్తున్నామన్నారు. ఉల్లిపాయ, టమాట, బంగాళదుంపలు, వంట నూనె, కందిపప్పుల ధరలను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించామన్నారు. ప్రతీ రోజు ధరల పట్టిక బహిరంగంగా ఉంచాలని హెచ్చరించామన్నారు. అధిక ధరలు వసూలు చేస్తున్నారని వినియోగదారుల నుండి పిర్యాదులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ధరల నియంత్రణ కోసమే ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో వీఆర్వోలు జి.రమణ. జి.వెంకటేశ్వరరావు, ఐ.వి.వి.రమేష్. డీలర్ డి.ఏడుకొండలు, వీఆర్ఎ దివ్వి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేట్లపాలెంలో ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర

సామర్లకోట, మేజర్‌న్యూస్ : సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో గురువారం దుర్గాదేవి ఆధ్యాత్మిక శోభాయాత్ర ఘనంగా జరిగింది. గ్రామానికి చెందిన వందలాది మంది మహిళలు కలశాలతో పవిత్ర గోదావరి జలాలను తీసుకువచ్చి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అర్చకులు సురేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో దుర్గాదేవికి కలశాభిషేకం, పంచామృత అభిషేకం, హోమ పూజలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాష్టమి ప్రాముఖ్యతను పండితులు భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో గ్రామానికి చెందిన నాయకులు, మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అమలాపురం పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 758/2020-ఇ1 తేదీ : 10-10-2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు

అమలాపురం పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో రెండు (2) పనులకు రూ.20.70 లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండరు పిలువబడినది.

టెండరు షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ :
ది. 10.10.2024 సాయంత్రం గం.07.00ల నుండి
ముగింపు తేదీ :
ది. 25.10.2024 ఉదయం గం.11.00ల వరకు.

మిగిలిన వివరములు www:tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.

కమిషనరు,
అమలాపురం పురపాలక సంఘం

సామర్లకోట పురపాలక సంఘం

ఇంజనీరింగ్ విభాగము

ఆర్.ఓ.సి. నెం. 182/2024-ఇ1 తేదీ : 09-10-2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండరు నోటీసు (2వ పిలుపు)

సామర్లకోట పురపాలక సంఘం జనరల్ నిధులతో ఇ.సి.వి. రూ.4.47 లక్షలతో 4 పనులను చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిని ఆన్‌లైన్ ద్వారా టెండ

ఆలయాల్లో ఎమ్మెల్యే మరియు తుమ్మల బాబులు ప్రత్యేక పూజలు

సామర్లకోట, మేజర్‌న్యూస్ : సామర్లకోట పట్టణంలో పలు దేవీ ఆలయాల్లో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి (బాబు)లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా గురువారం సామర్లకోట పట్టణంలో వారు పలు దేవీ ఆలయాలను సందర్శించారు. మాచరమ్మ గుడి వీధిలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి ని, మట్టపల్లి వారి వీధిలోని సత్తమ్మ తల్లి అమ్మవారిని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రజకుల వీధిలో ఏలేరు- గోదావరి కాలువ సమీపాన మధ్యన ఉన్న కావమ్మ పేరంటాళ్ల అమ్మవారిని ఎమ్మెల్యే రాజప్ప, జనసేన జిల్లా అధ్యక్షులు బాబులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆలయం శిథిలావస్థకు చేరుకుందని ఆలయ నిర్వాహకుల కుటుంబం ఎమ్మెల్యే రాజప్ప దృష్టికి తీసుకువెల్లగా ఆలయ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా నాయకులు అడబాల కుమార స్వామి, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, అందుగుల జార్జి చక్రవర్తి, గోల్తి సత్యనారాయణ, పడాల వీరబాబు, వల్లూరి దొరబాబు, కుంచె శ్రీను, సుకపట్ల మారయ్య, జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో 14 నుండి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు

-ఎంపీడీవో యాదగిరిశ్వరరావు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని 19 పంచాయతీలలో ఈ నెల 14 నుండి 20 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరేశ్వరరావు తెలిపారు. సిఆర్‌పి & ఆర్‌డి కమిషనర్ ఆదేశాలుమేరకు ఎంజిఎన్‌ఆర్ ఈజిఎస్ పథకం ద్వారా మంజూరైన వివిధ రకాల అభివృద్ధిపనులకు ప్రజా ప్రతినిధులు ప్రారంభోత్సవం చేయనున్నట్లు ఆయన తెలిపారు. మినీ అమృత సరోవర్, మట్టి రోడ్డు నిర్మాణం, సిసి రోడ్, సీసీ డ్రైనేజ్, గోకులం, ఆర్ డబ్ల్యూ హెచ్ ఎస్, ఎస్ఎంసి ట్రెంచ్, పొలంలో రింగ్ ట్రెంచ్, మేకల షెడ్డు వంటి అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుగుతాయన్నారు.

మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత

-సిడిపిఓ శ్రీలక్ష్మి

పెరవలి,మేజర్‌న్యూస్ : మనుషుల అక్రమ రవాణా ను అరికట్టటం అందరి బాధ్యత అని పెరవలి సిడిపిఓ శ్రీ లక్ష్మి అన్నారు అక్టోబర్ 10వ తేదీ గురువారం ప్రజ్వల అనే స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్‌కే శివకుమార్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపైన అవగాహనా కార్యక్రమం పెరవలి సిడిపిఓ సమావేశ మందిరంలో జరిగింది.ఈ శిక్షణ కార్యక్రమం ను ఉద్దేశించి సిడిపిఓ శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే అతి పెద్ద నేరంగా ఉంది, ప్రతి రోజు ఎంతో మంది అమ్మాయిలు మహిళలు దీనికి గురి అవుతున్నారు, ప్రతి ఒక్కరు దీనిపైన అవగాహనా కలిగిఉండాలని ముక్యంగా ఉద్యోగం,సినిమాఅవకాశాలద్వారామోసంచేసివిదేశాలకు అమ్ముతున్నారు అని అన్నారు. ప్రతి మహిళ తమ పరిధిలో ఉన్న వారికీ అవగాహనా కల్పించి రక్షించాలని అన్నారు. సూపర్వైజర్ ఎం బాల సరస్వతి మాట్లాడుతూ ఈ అక్రమ రవాణాకు మరియు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛందసంస్థ గత28 సంవత్సరాలుగా పద్మశ్రీ డా. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యాశాఖ,న్యాయ శాఖల సమన్వయముతో ఇప్పటి వరకు 28200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించడం జరిగింది, సమాజం లో జరుగుతున్న అక్రమ రవాణా ను అరికట్టడం లో అందరు భాగస్వామ్యం కావాలి అని మరియు ప్రతి గ్రామ లలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూప్స్ ను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమతంగా ఉంటారని అన్నారు. అక్రమ రవాణాకు గురి అయినా పిల్లలను శ్రమ దోపిడీ, అవయవాల దోపిడీ మరియు లైంగిక దోపిడీకి గురి అవుతున్నారు అన్నారు. ఎం భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నేటి కాలంలో యువత మొబైల్ ఇంటర్నెట్ ద్వారా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అవుతున్నారు, అనుమానస్పద వ్యక్తుల నుండి మెసేజ్ గాని కాల్స్ గాని వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని గురి అయినసందర్భాలలో 1930 అనే టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించాలి అని అన్నారు. ప్రజ్వఅసిస్టెంట్ కోఆర్డినేటర్ శివకుమార్ మాట్లాడుతూ గ్రామం పరిధిలో అవగాహనా కల్పించి జాగ్రత్త గా ఉండాలని చెప్పారు. ఈ లైంగిక వ్యాపారానికి పేద, మధ్య తరగతి, మారుమూల గ్రామాల యువతులను ఉద్యోగం, సినిమా అవకాశాలు, డబ్బు ఆశ తో మభ్యపెట్టి తీసుకెళ్లి వ్యభిచార గృహలకు అమ్ముతున్నారు, అక్కడ వారు చాలా దుర్భర స్థితిలో చనిపోతున్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీ టీచర్లకి లఘు చిత్రల ద్వారా అవగాహన కల్పించడం జరిగింది అనిఅన్నారు. ఈకార్యక్రమంలో ప్రజ్వల,అసిస్టెంట్ కోఆర్డినేటర్స్ శివ, సుప్రీయ, మరియు అనిల్ అంగన్వాడీ టీచర్స్ మరియు తదితరులు పాల్గొన్నారు.

చండీయాగం నిర్వహించిన జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు

హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు

జగ్గంపేట,మేజర్‌న్యూస్ : జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో జ్యోతుల నెహ్రూ స్వగృహం నందు కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు చండీయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ చైర్మన్ జగ్గంపేట కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షురాలు జ్యోతుల మణి దంపతులు హాజరయ్యారు. భవాని భక్తులకు బిక్ష ఏర్పాటు చేసి తాంబూలం అందించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ దంపతులు మాట్లాడుతూ దేవీ నవరాత్రులు ఎనిమిదవ రోజు పురస్కరించుకుని గురువారం అమ్మవారు కనకదుర్గ అమ్మవారి రూపంలో దర్శనం ఇవ్వడం జరుగుతుందని జిల్లాలోని నియోజకవర్గంలోని ప్రజలకు, రైతులకు, అన్ని వర్గాల వారికి ఆ దుర్గాదేవి కటాక్షం లభించాలని ఆ అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని అందరికీ మంచి జరగాలని ఈ చండీయాగం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తోట సర్వారాయుడు సునీత దంపతులు, ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కోర్పు సాయి తేజ, కందుల చిట్టిబాబు, తోట రవి, తోట గాంధీ, వీరం రెడ్డి కాశిబాబు, జీను మణి బాబు, అడబాల వెంకటేశ్వరరావు, జాస్తి వసంత్, చదరం చంటిబాబు, పాఠం శెట్టి రవి, బస్వా వీరబాబు, నీలం శ్రీను, రేఖ బుల్లి రాజు, పైడిపాల సూరిబాబు, అడబాల భాస్కరరావు, బొల్లం రెడ్డి రామకృష్ణ, కందుల బాబ్జి, వేములకొండ జోగారావు, బొజ్జపు శ్రీను, అధిక సంఖ్యలో భవానీలు భక్తులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ ఖిద్మత్ కమిటీ నిర్వహిస్తున్న ఉచిత అంబులెన్స్ సేవలు పునః ప్రారంభం

కాకినాడ, మేజర్ న్యూస్ : నగరవాసుల సౌకర్యార్థం కాకినాడ ఖిద్మత్ కమిటీ నిర్వహిస్తున్నఉచితఅంబులెన్స్‌సేవలుపునః ప్రారంభమయ్యాయి. గురువారం ఈ అంబులెన్స్‌లను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన జెండా ఊపి ప్రారంభించారు. కాకినాడ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత సేవల వివరాలను కమిషనర్ భావనఅడిగి తెలుసుకున్నారు. కమిటీ సభ్యులను అభినందించారు.మరిన్నిసేవాకార్యక్రమాలునిర్వహించాలని సూచించారు.

రు.10 లక్షలతో ఆధునీకరించిన కబేళాను ప్రారంభించిన సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంమేజర్‌న్యూస్ : రాజకీయాలకు అతీతంగా వ్యాపారస్తులు తమ వ్యాపార అభివృద్ధిని పెంచుకోవాలని సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఆవ రోడ్డులో వున్న మేకల మరియు గొర్రెలు కబేళాను(ఆధునిక జంతువధ శాల) సిటీ శాసనసభ్యులు, స్థానిక నాయకులు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రు.10 లక్షల రూపాయలతో ఆధునికరించిన మేకల మరియు గొర్రెలు కబేళా (ఆధునిక జంతువధ శాల)ను,రు.4 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన విద్యుత్ జనరేటర్, రు.3 లక్షల రూపాయలు నిర్మించిన స్లాట్స్ కటింగ్ మిషన్ ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ రాజకీయాలకు, వ్యాపారాలకు ముడి పెట్టవద్దని, వ్యాపారస్తులు తమ వ్యాపారాభివృద్ధిని పెంచుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఆదిరెడ్డి అప్పారావు కబేళా ఆధునీకరణకు నిధులు మంజూరుకు కృషి చేశారన్నారు. నగర పాలక సంస్థ కబేళా ఆధునికరణకు నగరపాలక సంస్థ ముగ్గురు సభ్యులకు కూడిన కమిటీని వేసిందన్నారు. వీరు రాష్ట్రలో ఏయే ప్రాంతాల్లో స్లాట్ హౌస్ బాగా నడుస్తున్నాదో అక్కడకు వెళ్లి అక్కడ అమలు జరుగుతున్న ప్రక్రియను మున్సిపల్ కార్పొరేషన్ చెప్పడం ద్వారా ఇక్కడ స్లాట్ హౌస్ నిర్మాణం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రాజమండ్రి ముస్లిమ్ మటన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు మోహమ్మద్ అబ్దుల్లా,యాదవులసంఘంఅధ్యక్షులునక్కాశేఖర్,స్థానిక. నాయకులు, నగర పాలక సంస్థఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక చికిత్స కేంద్రాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్:గురువారం తూర్పు గోదావరిజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె.ప్రకాష్‌బాబు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మానసిక చికిత్స కేంద్రాన్ని మరియు వన్ స్టాప్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ విభాగంలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారికి అందుతున్న వైద్య సదుపాయాలు మరియు ఇతర వివరాలను గురించి సదరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మానసిక రుగ్మతల నుండి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగివారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగుచర్యలు తీసుకోవాలని, ఈవిషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా సహకారం అందిస్తామన్నారు. మానసిక చికిత్స విభాగంలో చికిత్స పొందుతున్న వారితో కార్యదర్శి గారు మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి అందిస్తున్న సదుపాయాలు, వైద్యులు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు పాటిస్తే త్వరగా కోలుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.ఎమ్. లక్ష్మి సూర్య ప్రభ, డా. ఎన్. అన్నపూర్ణ , మానసిక చికిత్స కేంద్రానికి సంబందించిన డాక్టర్లు, సిబ్బంది మరియు వన్ స్టాప్ కేంద్రానికి సంబందించిన సిబ్బంది పాల్గొన్నారు.

పాపికొండలు విహారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

-కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి.
-బోటింగ్ ఆపరేటర్లుతో సమావేశం
-ప్రాంతీయ సంచాలకులు వి.స్వామీ నాయుడు

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : గండిపోచమ్మ బోటింగ్ పాయింట్ నుండి పేరంటాలపల్లి వరకు, పోచవరం బోటింగ్ పాయింట్ నుంచి పేరంటాలపల్లి వరకు ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ నిర్వహిస్తున్న బోటింగ్ కార్యకలాపాల నిర్వహణ విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని టూరిజం రాజమండ్రి హబ్ పర్యటక ప్రాంతీయ సంచాలకులు వి స్వామీ నాయుడు తెలియ చేశారు. గురువారం స్థానిక రాజమహేంద్రవరం బోటింగ్ కంట్రోలర్ రూమ్ నందు పాపికొండలు బోటింగ్ గురించి బోట్ ఆపరేటర్లు తీసుకోవలసిన జాగ్రత్తలు విషయమై పర్యాటకశాఖ అధికారులు ప్రైవేటు బోటు ఓనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రైవేటు బోటు ఆపరేటరు బోటుకు సంబంధించి పర్యాటక శాఖ నుంచి నిరభ్యంతర పత్రము, ఇరిగేషన్ శాఖ నుండి రూట్ పర్మిషన్ , మారిటైం బోర్డు నుంచి బోటు లైసెన్సు పొంది ఉండాలన్నారు. అవి వాలిడిటీలో ఉండాలని ప్రతి బోటులో లైఫ్ సేవింగ్ మరియు ఫైర్ ఫైటింగ్ పరికరాలు ఉండాలన్నారు. సిలిండర్లు బోట్లో తీసుకు వెళ్ళరాదని ఓనర్స్ అసోసియేషన్ కి పర్యాటక అధికారులు తెలియజేశారు. ప్రయాణీకుల చిరునామా, మొబైల్ నెంబర్ తో సహా పూర్తి వివరాలను నమోదు చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందిని ఆదేశించారు. పరిమితికి మించి ఓవర్ లోడింగ్ ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదని, ఈ విషయమై నిర్లక్ష్యం గా ఉన్న సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రైవేట్ బోట్స్ లో పనిచేసే సిబ్బందికి అందరికి ఐడెంటిటీ కార్డు లు ఇవ్వాల్సిందిగా ప్రైవేట్ బోట్ ఓనర్స్ కి సూచించారు. లైసెన్స్ పొందిన డ్రైవర్లు మాత్రమే బోట్స్ నడపాలని, బోట్లో ప్రయాణించే టూరిస్ట్ లకి, బోటులో పని చేసే స్టాఫ్ కి అందరికీ ఇన్సూరెన్స్ ఉండాలని తెలిపారు. బోట్ ప్రారంభం అయ్యే ముందుగా ప్రయాణికులకు ప్రయాణం లో పాటించవలసిన జాగ్రత్తలను తెలపాలని, వాకి టాకీ లను ఛార్జింగ్ లో ఉంచుకోవాలని తెలిపారు. బోట్ వెళ్ళినప్పటి నుంచి తిరిగి వచ్చేవరకు కంట్రోల్ రూమ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డివిజనల్ మేనేజర్ సిహెచ్, పవన్ కుమార్, వాటర్ ఫ్లీట్ అసిస్టెంట్ మేనేజర్ ఆర్. గంగ బాబు, గండి పోచమ్మ బోటింగ్ కంట్రోల్ రూమ్ మేనేజర్ బి. సాంబశివరావు, రాజేష్, ప్రైవేట్ బోర్డ్ ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బి. శ్రీనివాసరావు , జి జి మురళి రాము, బి రాము, ప్రకాష్ రావు , మోహన్ రావు , మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లు అందరూ ఉమ్మడిగా పోరాడితేనే మేనేజ్మెంట్ దిగివస్తుంది

-ఐకమత్యంగా ఉంటేనే మన డిమాండ్లు మనం సాధించుకోగలం
-జోనల్ జనరల్ సెక్రెటరీ పిఎల్ నరసింహారావు

పెరవలి, మేజర్ న్యూస్ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో 13 లక్షలకు పైబడి ఏజెంట్లు సంస్థ అభ్యున్నతి కొరకు అవిశ్రాంతంగా పనిచేస్తున్నారని ప్రస్తుత విధానాలు పరిశీలిస్తే ఏజెంట్లు అందర్నీ వారు అమితంగా ప్రేమించే ఎల్ఐసి సంస్థ నుండి దూరంగా జరిపే కుట్ర జరుగుతుందని తద్వారా సంస్థను బలహీనం చేసి ప్రైవేట్ సంస్థలకు అప్పగించే కుట్ర జరుగుతుందని ఇటువంటి కుట్రలకు వ్యతిరేకంగా ఏజెంట్లు అందరూ ఉమ్మడిగా ఐకమత్యంగా జేఏసీగా ఏర్పడి పోరాడితేనే మేనేజ్మెంట్ ఐఆర్డీఏ దిగి వస్తాయని జోనల్ జనరల్ సెక్రెటరీ పి ఎల్ నరసింహారావు అన్నారు. అక్టోబర్ 10వ తేదీ గురువారం తణుకు ఎల్ఐసి బ్రాంచ్ ఆవరణలో జరిగిన గేట్ మీటింగ్లో పాల్గొన్న నరసింహారావు హాజరైన ఏజెంట్లు అందరినీ ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల ఎల్ఐసి పాలసీలలో వచ్చిన మార్పులు పై, ఏజెంట్లకు భారీగా కమిషన్ తగ్గించడంపై, పాలసీదారులకు ప్రీమియం పెంచడంపై, 55 సంవత్సరాల వారికి ఇచ్చే సరళతర పాలసీలను 50 సంవత్సరాలకు కుదించడంపై, తణుకు బ్రాంచ్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు.ఎల్ఐసి మేనేజ్మెంట్ తీసుకున్న ఏజెంట్ల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఎల్ఐసి ఏజెంట్లకు సంబంధించిన అన్ని అసోసియేషన్ల పిలుపు మేరకు తణుకు బ్రాంచ్ కి సంబంధించిన ఏజెంట్లు అందరూ ఏకతాటిపైకి వచ్చి ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మక జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 ప్రదానోత్సవ కార్యక్రమం ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు మీ జీ తెలుగులో..!

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : నిరంతరం ప్రేక్షకులకు వినోదం అందిస్తూ విజయవంతంగా కొనసాగుతున్న ఛానల్ జీ తెలుగు. ఎదురులేని ప్రయాణంలో ఛానల్ ఉన్నతికి తమవంతు కృషి చేస్తున్న ప్రతిభావంతులైన నటీనటులు, కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు.. అందరినీ గౌరవిస్తూ అందించే సత్కారమే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్. ప్రతిష్ఠాత్మక జీ తెలుగు కుటుంబ అవార్డులను అందుకుని మరింత ఉత్సాహంతో ముందుకు సాగాలని నటీనటులను ప్రోత్సహిస్తుంది. ప్రతి ఏటా ఘనంగా జరిగే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ వేడుక ఈ సంవత్సరం మరింత వైభవంగా జరిగింది. జీ తెలుగు తారలు, టాలీవుడ్ ప్రముఖులతో సందడిగా సాగిన జీ తెలుగు కుటుంబం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమ మొదటి భాగం అక్టోబర్ 12 సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి..! టాలీవుడ్ ప్రముఖులు, బుల్లితెర నటీనటులతో సందడిగా సాగిన జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 పార్ట్ 1 కార్యక్రమానికి ఎనర్జిటిక్ జోడీ రవి- లాస్య వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. జీ తెలుగు సీరియల్స్ కుటుంబాలన్నీ కలగలసి ఊరేగింపుతో ఘనంగా మొదలైన కార్యక్రమం అద్భుత ప్రదర్శనలు, అనుభవాలు, భావోద్వేగాల సమాహారంగా సాగుతుంది. ఇక, జీ తెలుగు పాపులర్ సీరియల్స్ పడమటి సంధ్యారాగం, నిండు నూరేళ్ల సావాసం నటీనటులు ఆడే ఫజిల్ గేమ్ ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తుంది. టాలీవుడ్ సీనియర్ నటీనటులు భానుచందర్, అర్చన ఈ కార్యక్రమానికి హాజరై తమ అనుభవాలను పంచుకుని నవ్వులు పూయించారు.

జీ తెలుగు సీరియల్ జంటలతో సాగే మ్యూజికల్ డాన్స్ వార్లో సరిగమప సింగర్స్ పోటాపోటీ ప్రదర్శన ఆకట్టుకుంటుంది. అంతేకాదు, ఈ వేడుకకు మెగాబ్రదర్ నాగబాబు ముఖ్య అతిథిగా హాజరై జీ తెలుగుతో తన అనుబంధాన్ని పంచుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ వరల్డ్ రికార్డ్సో చోటు దక్కించుకున్న సందర్భంగా డ్రామా జూనియర్స్ చిన్నారుల ప్రత్యేక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంటుంది.

యాక్షన్ ప్రియుల కోసం లైవ్లో గగన్ రౌడీలతో చేసే ఫైట్ సీక్వెన్స్ ఆసక్తికరంగా సాగుతుంది. డాన్స్ కాంపిటీషన్లో భాగంగా జూనియర్లు రెట్రో ప్రదర్శన ఇవ్వగా, సీనియర్లు ట్రెండింగ్ పాటలకు డాన్స్ చేసి అలరిస్తారు. రామలక్ష్మి & శౌర్య, ఆద్య & శ్రీను, రూప & రాజు, శ్రీకర్ & అవని జంటలు వేదికపై చేసే సందడి సరదాగా సాగుతుంది. సీనియర్ నటీమణులు అన్నపూర్ణమ్మ, వై.విజయ సీరియల్ కోడళ్లతో చేసే సంభాషణ కడుపుబ్బా నవ్విస్తుంది. అద్భుతమైన ప్రదర్శనలతో వినోదంగా సాగే ఈ కార్యక్రమంలో మీ అభిమాన నటులు ఏ అవార్డు గెలుచుకున్నారో తెలుసుకోవాలంటే జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2024 కార్యక్రమాన్ని మిస్ కాకుండా చూసేయండి.

పౌరసరఫరాల మంత్రి తనిఖీలు..భారీగా పట్టుబడ్డ రేషన్ బియ్యం

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులు ,గోడౌన్ లు తనిఖీ చేస్తున్నారు. పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన తూర్పుగోదావరి జిల్లాలోని నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు రైస్ మిల్లులు, గొడౌన్ లు తనిఖీ చేశారు. ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి ఎన్ని తనిఖీలు నిర్వహిస్తున్నా రేషన్ బియ్యం యధావిధిగా రీసైక్లింగ్ అవుతున్నాయి. ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ వైఫల్యం బయటపడుతోంది.

.. మంత్రి నాదెండ్ల తనిఖీలు అనంతరం తూర్పుగోదావరి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు వివరాలు వెల్లడించారు పౌరసరఫరాల శాఖ మంత్రి తనిఖీల అనంతరం పలు ప్రాంతాలలో పోర్టిఫైడ్ బియ్యం నిల్వ ఉంచిన విషయం బయటపడింది అన్నారు. నల్లజర్ల మండలం వీరవల్లి గ్రామ పరిధిలో టోల్గేట్ వద్ద 16 నెంబర్ జాతీయ రహదారిపై ఏలూరు నుంచి కొవ్వూరు వైపు వస్తున్న పలు లారీలు తనిఖీ చేశారు...నల్లజర్ల లోని శ్రీ వెంకతసత్యా రైస్ అండ్ ఫ్లోర్ మిల్లు లో 80 వేల కేజీల బియ్యం లభ్యం కాగా వాటి విలువ రూ 36.40 లక్షలుగా గుర్తించారు. దేవరాపల్లి లోని వరలక్ష్మి రైస్ మిల్లు లో రూ 12,285 విలువ చేసే 270 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు.ఇదే గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరా రైస్ మిల్లులో 16 వేల కేజీల బియ్యం కనుగొన్నారు.మొత్తం 96,270 కేజీల రూ 36.52 లక్షల విలువ చేసే బియ్యం పట్టుకుని కేసులు పెట్టినట్లు జెసి చిన్నారాముడు తెలిపారు

సమాచార హక్కు చట్టంతోనే విధి నిర్వహణలో పాదదర్శకత సాధ్యం

-ఆర్‌టిఐ 19వ వార్షిక కార్యక్రమంలో పాల్గొన్న శిశు సంక్షేమ అధికారి కె.విజయ కుమారి

రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ : గురువారం స్థానిక కందుకూరి మహిళా స్టేట్ హోంలోగార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ అధ్యర్యంలో సహా చట్టం 19 వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా జిల్లా మహిళా &శిశుసంక్షేవఅధికారివిజయకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ కుమారిమాట్లాడుతూ, సమాచార హక్కు చట్టంతోనే హక్కులు పొందవచ్చని,హక్కులతో పాటు భాద్యతలు గుర్తించుకొని పనిచేయాలన్నారు స.హా.చట్టంప్రతిఒక్కరికి ఏంతో మేలు చేస్తుందన్నారు. సమాచార హక్కు చట్టం వినియోగం వాళ్ళ ప్రభుత్వ పనితీరులో పాదదర్శకత పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తమ విధుల్లో జవాబుదారీతనం వహించిన కొంతమంది అంగన్ వాడీ వర్కర్లను గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ ప్రతి నిధులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి గార్డ్స్ ఫర్ ఆర్‌టిఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారుఈసందర్భంగా కొంతమూరు షణ్ముఖ లయన్స్ క్లబ్ అధ్యక్షులు పామర్తి నాగరాజు అధ్యర్యంలోరాజమహేంద్రవరం రూరల్ భవానీపురంకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు అయినా అరుగుల సాయి కుమార్ కు వీల్ చెయిర్ ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లబ్ మెంటర్ బాబు సర్,విశ్రాంత ప్రత్యేక గౌరవ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ వెంపటి విశ్వనాధం, గార్డ్స్ ఫర్ ఆర్ టి ఐ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వరరావు, మహిళా కన్వీనర్ ఆకుల విజయభారతి, సీనియర్ న్యాయవాది, తోరాటి వసంతరావు, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 17,18,19 తేదీలలో పల్లె పండగ

- పంచాయతీ వారోత్సవాలు - ఎంపిడిఓ శ్రీలలిత

పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్: పెద్దాపురం మండలంలో ఈ నెల 17, 18, 19 తేదిలలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, పెద్దాపురం ఎంపిడిఓ డి.శ్రీలలిత తెలిపారు